భారతంలో ప్రేమ కథలు
సుభద్ర

-ముక్తేవి లక్ష్మణరావు,
డా॥ ముక్తేవి భారతి

దక్షిణ దేశ తీర్థయాత్రలు పూర్తి చేసుకుని, పశ్చిమ తీరంలో పుణ్యక్షేత్రమయిన ప్రభాస తీర్థాన్ని చేరాడు అర్జునుడు. దగ్గరలో ఉన్న ద్వారక వైపు అతని మనసు మరలింది. ద్వారక పేరు తలచుకోగానే నారాయణ రూపుడైన శ్రీకృష్ణుడు, తమ పూర్వజన్మలోని నరనారాయణాంశ గుర్తొచ్చాయి. ఊహల్లో తేలిపోతున్న అర్జునునికి సుభద్ర రూపం స్ఫురించింది.

తీర్థయాత్రా సమయంలో మహావీరుడైన యాదవుడు గదుడు సుభద్ర సౌందర్యాన్ని వర్ణించాడు. ముల్లోకాల్లోనూ అలాటి అపురూప సౌందర్యరాశి లేదని గదుడు చేసిన వర్ణన ఉప్పెనలా తేనుకువచ్చి అర్జునుని మనసును కదిపింది. ఆమెను చూడాలనే కుతూహలం ఎక్కువైంది.

దేవతా స్త్రీలను, నాగకాంతలను, భూలోక సుందరీమణులను చూసిన అర్జునునికి, అందర్నీ మించిన సౌందర్యరాశి అయిన సుభద్రను చూసే భాగ్యం ఎన్నటికి కలుగుతుందోనని మనసు అరాటపడటం మొదలుపెట్టింది.

ద్వారకాపురి సమీపాన ఉన్న ప్రభాసతీర్థం చేరుకున్నాక, అర్జునుని మేధస్సులో మెరపు మెరిసినట్లు ఒక ఆలోచన వెలిగింది. తను ప్రచ్ఛన్న వేషం వేయక తప్పదు. యాదవ ప్రముఖులకు యతీశ్వరులంటే భక్తి గౌరవా లున్నాయని అతనికి తెలుసు.

నిష్ఠతో నారాయణ ధ్యానం చేశాడు అర్జునుడు. ఆ ధ్యాన విశేషమన్నట్టుగా, అర్జునుని రాక విని, అర్జున దర్శనార్థం వచ్చాడు కృష్ణుడు. తీర్థయాత్రా విశేషాలు వింటూ అర్జునుని వద్ద ఎంతసేపో గడిపాడు కృష్ణుడు. అప్రయత్నంగా సుభద్ర ప్రస్తావన తెచ్చి, అరమోడ్పు కన్నులతో పారవశ్యంలో మునిగిపోయిన అర్జునుని చిరునవ్వుతో గమనించాడు కృష్ణుడు. ద్వారకా నగరం విచ్చేయమని యతికి తగిన వసతి ఏర్పాటు చేస్తానని సాదరంగా ఆహ్వానించాడు అర్జునుని కృష్ణుడు.

ద్వారకాపుర వాసులకి అత్యంత ప్రీతిపాత్రమైంది రైవతక పర్వతం. అక్కడి రమణీయ మందిరంలో విడిది ఏర్పాటయింది అర్జునునికి. అక్కడి మనోహరమైన ప్రదేశాల్ని దర్శిస్తూ, ఉద్యానవనాలు చూస్తూ కృష్ణునితో కలసి విహరించాడు అర్జునుడు.

ఆనాడు రైవతక పూజా మహోత్సవం జరుగుతోంది. భక్తి శ్రద్ధలతో పూజలు సలిపే జనసమూహాన్ని తిలకిస్తున్నాడు అర్జునుడు.

చెలికత్తెలతో వచ్చి పూజా మహోత్సవంలో పాల్గొన్న ఒక యువతి అర్జునుని కళ్ళముందు విద్యుల్లతలా మెరిసింది. సుభద్రా సుందరి మహావీరుడైన అర్జునుడే తనకు భర్త కావాలని మనసులో అనుకుంటూ, భగవంతుని ధ్యానిస్తోంది. ఆమె కదలుతుంటే ఆమె కాలి మంజీరాల నవ్వుడులు, కంకణాల గలగలలు అర్జునుని మనసులో మధురంగా ధ్వనించాయి.

గదుడు చేసిన వర్ణన అక్షరాల నిజమనిపించింది అర్జునునికి. అతని చూపులు ఆమె వెళ్ళిన దిక్కే నిలిచిపోయాయి. ప్రథమ వీక్షణంలోనే తనను ఇంతగా ఆకట్టుకున్న ఆమెను తను చేపట్టితీరాలి త్వరలో అనుకున్నాడు. కానీ తన కోరిక అంత త్వరలో నెరవేరటం ఎలా సాధ్యం?

ద్వారకాపురిలోని తన కున్న ఒకే ఒక స్నేహితుడు కృష్ణుడు. దుర్యోధన స్నేహితులైన బలరామాదులు తన కోర్కెని తిరస్కరిస్తారు.

అప్పటికే యతీశ్వరునిపై భక్తి భావాలు ద్వారకా నగరవాసులకు పెరిగిపోయాయి. యతీశ్వరుని పరిచర్యాభాగ్యం సుభద్రకి శుభప్రదమని బలరామాదులను ఒప్పించాడు కృష్ణుడు. సుభద్ర యతీశ్వరునికి సేవలు చేయటానికి అంగీకరించారంతా సంతోషంగా.

యతికి సేవలు చేస్తున్న సుభద్ర మనసును అర్జునునిపైనే ప్రసరిస్తోంది. ఈమె సాంగత్యం ఎప్పటికి తనకు లభిస్తుందోనని యతి వేషధారైన అర్జునుని మనసు ఆవేదన చెందుతోంది.

మహావీరుడైన అర్జునుడు విశాల వక్షస్థలుడని, పద్మదళాయత నేత్రుడని, నీలమేఘ శ్యామలుడని, ఎన్నెన్నో విశేషాలు స్నేహితురాండ్రు వర్ణించి చెప్పగా వింది. ఆ రూపమే యతీంద్రునిలో భాసిస్తుంటే ఇతడే అతడా అనే సంశయం కలిగిం దొకసారి. మనిషిని పోలిన మనుమ లుండవచ్చునేమో !

సుభద్ర అర్జునుని వంక రెప్పపాటు లేకుండా చూస్తోంది. ఆనందోత్సాహాలు ముఖంలో పెల్లుబుకుతుంటే-

"ఆర్యా, ఇన్ని తీర్థప్రదేశాలు దర్శించిన మీరు, అమరావతికి సమానమైన ఇంద్రప్రస్థపురం దర్శించారా ఎప్పుడైనా, మహావీరుడైన అర్జునుడు తీర్థయాత్రార్థియై బయలుదేరాడని విన్నాను. అతను తిరిగి క్షేమంగా ఇంద్రప్రస్థం చేరాడా..." సుభద్ర ప్రశ్న వరంవరలకి అన్నిటికీ ఒకే సమాధానంలా చిరునవ్వు నవ్వాడు అర్జునుడు. అప్పటివరకు ప్రసన్నంగా ఉన్న అర్జునుడు, సుభద్ర మాటలు విని ఉద్రేకపూరితు డయ్యాడు. ఇక ప్రచ్ఛన్న వేషం అనవసరమని తలచాడు. సుభద్ర పాణిగ్రహణం చేస్తూ, "నేను అర్జునుణ్ణి. నీ దర్శనం కోసం, నీ సాన్నిహిత్యం కోసం వేసిందే ఈ వేషం-"

ఆ మాటలకి సుభద్ర ఆశ్చర్యంతో, ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిపోయింది. వెంటనే సిగ్గుతో తల వంచుకుంది. క్రీగంట అతని మనోహరాకారాన్ని దర్శిస్తోంది.

"నీకోసమే ద్వారకాపురికి వచ్చాను... మనిద్దరి కలయికకి ఈ ఏర్పాటు చేసింది నీ అన్నగారు కృష్ణుడే".

సుభద్ర ముసి ముసిగా నవ్వుకుంది.

అంతలోనే ఆమె మనసు చింతాక్రాంతమైంది. దుర్యోధనాదులతో స్నేహ మున్న బలరాముడు, తను అర్జునుణ్ణి వివాహం చేసుకుందుకు అంగీకరించడు. తను అర్జునుని తప్ప వేరొకరిని వివాహమాడదు - ఈ సమస్య ఎలా తేలుతుందో, తన కోరిక ఎలా నెరవేరుతుందో అనుకుంటూ చెక్కిట చేయి చేర్చి దీర్ఘమైన ఆలోచనలో పడిపోయిన సుభద్ర వంక చిరునవ్వుతో చూశాడు అర్జునుడు.

"గాంధర్వం, రాక్షసం క్షత్రియులకు ఉత్తమమైన వివాహాలు -" ఆ మాటకి సుభద్ర తనువెల్లా పులకించింది. అరుణమైన ఆమె అధరాలు అరుణారుణా లయినాయి. చిరుచెమటలు ముఖాన అలుముకున్నాయి.

"నా అన్న కృష్ణునికి తెలియవర్చటం మన విద్యుత్ ధర్మం కదా" - సుభద్ర కళ్ళు దించుకునే అంది. మరుక్షణంలో అతివేగంగా అంతఃపురం చేరింది.

సుభద్రార్జునుల అన్యోన్యానురాగాన్ని గమనిస్తున్నాడు కృష్ణుడు. మహావీరుడైన అర్జునుడు సుభద్రకు భర్త కాబోతున్న విషయం సత్యారుక్మిణులకు, దేవకీవసుదేవులకు మాత్రం తెలిపి, మరెవరికీ తెలియనీయకుండా రహస్యంగా దాచాడు.

సముద్ర మధ్యంలో ఉన్న ద్వీపం వద్దగల వశువతి ఆలయంలో ఉత్సవాలు ఏర్పాటు చేశాడు కృష్ణుడు. బలరామాది యాదవులంతా భక్తి తత్పరతతో ఆ ఉత్సవంలో పాల్గొన్నారు. అంతా మధుపాన మత్తులై ఉత్సవ ఉత్సాహంలో మునిగిపోయారు.

అదే సమయంలో ద్వారకాపురంలో సుభద్రార్జునుల వివాహ మహోత్సవం తలపెట్టాడు కృష్ణుడు. సంకల్పమాత్రం చేతనే ఇంద్రాది దేవతలు, నారదాది మహర్షులు వివాహానికి విచ్చేసి, వధూవరుల నాశీర్వదించారు.

విజయుడు విజయోత్సాహంతో సుభద్ర సహితుడై ఊరు వదలి ప్రయాణిస్తుంటే, ద్వారకాపుర రక్షకులు, యాదవ వీరులు క్రోధారుణ నేత్రాలతో యుద్ధ సన్నద్ధులై విజృంభించారు అర్జునునిపైకి.

కానీ అందరి ప్రయత్నం విఫలమైంది. మహావీరుడైన అర్జునుడు సుభద్ర వధూమణితో కలసి ఇంద్రప్రస్థంలో అడుగు పెట్టాడు. *